క్లుప్తంగా

రామాలయంలో ఘనంగా ఉత్సవ విగ్రహ ప్రతిష్ట



భట్టిప్రోలు: భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి చావలి వారి వీధిలో నూతనంగా నిర్మించిన శ్రీ రామాలయంలో ఉత్సవ విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు సోమవారం కన్నుల పండువగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో వేల్పూరి సాయికృష్ణ, ఉషశ్రీ దంపతులు పాల్గొన్నారు. ఉత్సవ విగ్రహాలను పిట్ల నాగేశ్వరరావు, సుభాషిణి దంపతులు అందించారు. పోతార్లంకకు చెందిన మురళీ కృష్ణమాచార్యులు శిష్య బృందం అంకురారోపణ, పూర్ణాహుతి హోమం, ప్రతిష్టా మహోత్సవాలు నిర్వహించారు. యునెస్కో వాస్తు పండిట్ వంగర చలమయ్య సిద్ధాంతి పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చెరుకుపల్లి: మండలంలో విద్యుత్ మరమ్మత్తుల కారణంగా నేడు విద్యుత్ అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ ఏఈ అజహర్ భాషా సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. దీనిని గమనించి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రజా చైతన్యంతోనే అగ్ని ప్రమాదాల నివారణ




పొన్నూరు: ప్రజలు చైతన్యవంతంగా ఉండి అగ్ని ప్రమాదాలను నివారించాలని పొన్నూరు అగ్నిమాపక కేంద్ర అధికారి కె.ప్రసాదరావు పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా సోమవారం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్, ఆర్టీసీ బస్ డిపోలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు వ్యాపించిన మంటలను ఎలా అదుపు చేయాలి? వెంటనే చేపట్టాల్సిన చర్యలను అగ్నిమాపక సిబ్బంది చేసి చూపించారు. అగ్ని ప్రమాదాల నివారణకు చేయాల్సిన చర్యలపై ప్రచురించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్ని మాపక కేంద్ర సిబ్బంది, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

'మై డియర్ దొంగ' చిత్ర బృందం సందడి



పెదకాకాని: అభినవ్ గోమఠం, షాలినీ, దివ్య శ్రీపాద ప్రధానపాత్రల్లో సర్వజ్ఞకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న కామెడీ ఎంటర్టైనర్ మై డియర్ దొంగ చిత్ర యూనిట్ సందడి చేసింది. ఈ చిత్రం ఏప్రిల్ 19న ఆహా ఓటీటీలో విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర బృందం సోమవారం మండలంలోని నంబూరు వీవీఐటీ కళాశాలను సందర్శించింది. ఈ సందర్భంగా చిత్ర హీరో అభినవ్ గోమఠం మాట్లాడుతూ చిత్రం ఆద్యంతం హాస్య ప్రధానంగా సాగుతుందన్నారు. ఇటీవల విడుదలైన చిత్ర టీజర్‌కు విశేష స్పందన వచ్చిందన్నారు. ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకులను అలరిస్తుందన్నారు. అనంతరం చిత్ర బృందం సభ్యులు విద్యార్థులతో కలిసి నృత్యాలు, సెల్ఫీలతో సందడి చేశారు.

ఫ్యానుకు ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



కన్నయ్య మృతదేహం

గుంటూరు రూరల్: వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం జూనంచుండూరు గ్రామానికి చెందిన సాదర బోయిన కన్నయ్య(36) మండలంలోని వెంగళాయపాలెం గ్రామంలో పొలం కౌలుకు తీసుకుని సాగు చేశాడు. పంట సక్రమంగా పండక పోవటంతో దిగుబడి తగ్గింది. దీంతో నష్టం వాటిల్లింది. అప్పులు పెరిగి పోవటంతో తీవ్ర మనస్థాపానికి గురైన కన్నయ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించటంతో సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. మృతుని భార్య శాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు

కర్లపాలెం: కర్లపాలెం మండలంలో సోమవారం పెద్ద ఎత్తున గ్రామ వలంటీర్లు రాజీనామాలు చేశారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు, జనసేన వ్యవస్థాపకుడు పవన్ కల్యాణ్ గ్రామ వలంటీర్ల పట్ల ఇటీవల అనుచిత వ్యాఖ్యలు చేయటం, సంక్షేమ పథకాలు పంపిణీ చేయకుండా ఎన్నికల కమిషన్ ద్వారా వలంటీర్లను అడ్డుకోవటంతో మనస్థాపానికి గురైన వారంతా మూకుమ్మడి రాజీనామాలు చేస్తున్నారు. పెదపులుగువారిపాలెం సచివాలయంలో 11మంది, పేరలి సచివాలయం పరిధిలో 7గురు, తుమ్మలపల్లి సచివాలయం పరిధిలో ఒకరు, నల్లమోతువారిపాలెం సచివాలయం పరిధిలో 6గురు, కర్లపాలెం సచివాలయం పరిధిలో 29మంది మొత్తం 54 మంది గ్రామ వలంటీర్లు రాజీనామాలు చేసి రాజీనామా పత్రాలను తమకు అందజేయగా ఆమోదించినట్లు ఎంపీడీఓ నేతాజీ తెలిపారు.



ఎంపీడీవో నేతాజీకి రాజీనామా పత్రాలు అందజేస్తున్న కర్లపాలెం వలంటీర్లు

14 మంది వలంటీర్లు రాజీనామా

ఐలవరం(భట్టిప్రోలు): ఎన్నికల కమిషన్ వలంటీర్ల సేవలను నిలిపి వేయడాన్ని నిరసిస్తూ వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేస్తున్నారు. సోమవారం భట్టిప్రోలు మండలం ఐలవరం–1, 2 సచివాలయాల పరిధిలోని 14 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. పంచాయతీ సెక్రటరీ గోలి శ్రీనివాసరావుకు రాజీనామా పత్రాలు అందజేశారు. ప్రజలకు నిస్వార్థంగా సేవ చేస్తున్న తమ పట్ల టీడీపీ వ్యవహరిస్తున్న తీరు అమానుషమని వారు పేర్కొన్నారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు

కొల్లూరు : వలంటీర్లపై ప్రతిపక్ష టీడీపీ, జనసేన పార్టీలు చేస్తున్న విమర్శలను నిరసిస్తూ వలంటీర్ల రాజీనామా పరంపర కొనసాగుతోంది. సోమవారం మండలంలోని కొల్లూరు, చిలుమూరు, చినపులివర్రు సచివాలయాల పరిధిలోని 13 మంది వలంటీర్లు తామ రాజీనామ పత్రాలను మండలపరిషత్తు సిబ్బందికి అందజేసి తాము విధుల నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటించారు. ప్రజలకు నిస్వార్థ సేవలు అందించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వలంటీరు వ్యవస్థపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న వ్యాఖ్యల కారణంగా మనస్థాపానికి గురై తాము రాజీనామాలు చేస్తున్నట్లు ప్రకటించారు. వలంటీర్లు ఇచ్చిన రాజీనామాలను ఆమోదిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శులు, మండలపరిషత్తు అధికారులు తెలిపారు.

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): మండల పరిధిలోని భవనంవారిపాలెం గ్రామ వలంటీర్లు సోమవారం మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. ప్రతిపక్ష పార్టీ నాయకుల దుశ్చర్యలకు విసిగి పోయామని ప్రజలకు సంక్షేమ పథకాలు అందించలేని ఉద్యోగాలు తమకు అవసరం లేదని అందుకే మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నామని తెలిపి ఎంపీడీవో ఎంవి రమణమూర్తికి తమ రాజీనామా పత్రాలను అందజేశారు. అందరి రాజీనామాలను ఆమోదిస్తామని ఎంపీడీవో వారికి తెలిపారు. ఎంపీడీవో వెంట కార్యదర్శి వసుంధరాలక్ష్మి ఉన్నారు.



భట్టిప్రోలులో కార్యదర్శి శ్రీనివాసరావుకు రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు



రాజీనామా పత్రాలు అందజేస్తున్న పేరలి గ్రామ వలంటీర్లు



కొల్లూరులో మండల పరిషత్తు కార్యాలయ సిబ్బందికి రాజీనామ పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు

భట్టిప్రోలు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన భట్టిప్రోలుకు చెందిన 10 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరాయి. సోమవారం అమృతలూరులోని పార్టీ కార్యాలయంలో వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్ బాబు సమక్షంలో వీరంతా పార్టీలో చేరారు. వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి వీరిని అశోక్‌బాబు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. సీఎం జగన్ ఎన్నో విప్లవాత్మకమైన మార్పులను తీసుకువచ్చారని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించుకుని మరొకసారి జగన్‌ను సీఎంని చేసుకుందామని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ నాయకులు పసుపులేటి శివరామ ప్రసాద్, కొతరపు శ్రీనివాసరావులు ఆధ్వర్యంలో పార్టీలో చేరికలు జరిగాయి.



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న వరికూటి అశోక్‌బాబు

అవగాహనతో అగ్ని ప్రమాదాల నివారణ

అగ్నిమాపక శాఖ అధికారి సాంబశివరావు

రేపల్లె రూరల్: అగ్ని ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక శాఖ అధికారి వై.సాంబశివరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని రేపల్లె అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని రైల్వేస్టేషన్, బస్టాండ్ సెంటర్లలో ప్రయాణికులకు అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం కరపత్రాలను పంపిణీ చేశారు. రాజ్యలక్ష్మి థియేటర్ సెంటరులో అగ్నిమాపక శకటంతో ప్రత్యేక ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ మహిళలు ఇళ్ళలో వంట ముగిసిన తరువాత, రాత్రులు నిద్రపోయే సమయంలో తప్పనిసరిగా గ్యాస్ పొయ్యి రెగ్యులేటర్‌ను ఆపివేయాలన్నారు. విద్యుత్ వైర్ల నిర్వహణ సక్రమంగా ఉండేలా సరి చూసుకోవాలన్నారు. సమీపంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంటే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించి ప్రమాదాలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో అగ్ని మాపక శాఖ సిబ్బంది నాగేశ్వరరావు, ఎస్.నాగేంద్ర రెడ్డి, జీ.కోటేశ్వరరావు, వి.సుబ్బారావు, ఎం.జనార్ధనరావు, కేవీ సాయికృష్ణారెడ్డి, పి.హరిబాబు, బీ.వీరకుమార్, సీహెచ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను మహిళలకు అందజేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కోరిన కోరికలు తీర్చే కాశీవిశ్వేశ్వరుడు

- ఘనంగా స్వామివారి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం
- ప్రత్యేక పూజలు చేసిన కిలారి రోశయ్య, బలసాని

గుంటూరు రూరల్: భక్తులు కోరిన కోరికలు తీర్చే దేవుడు కాశీ విశ్వేశ్వరుడని వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య, ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్‌లు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గోర్లవారిపాలెం గ్రామంలో కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానం విగ్రహ ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ముఖ్యఅతిథులకు పూర్ణకుంభంతో సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మాట్లాడుతూ స్వామి దయతో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలు, పెద్దలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అభయ సీతారామాంజనేయ స్వామికి పూజలు..

అర్బన్ మండలం 41వ డివిజన్ స్వర్ణభారతినగర్ ఈ బ్లాక్ 4వ లైనులో నూతనంగా నిర్మించిన అభయ సీతారామాంజనేయస్వామి దేవాలయ విగ్రహ ప్రతిష్టా మహోత్సవంలో బలసాని కిరణ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలను నిర్వహించారు. స్వామి దయతో ప్రజలంతా సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఆలయం కమిటీ సభ్యులు ఎమ్మెల్యే అభ్యర్థికి సాదర స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



కాశీ విశ్వేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎంపీ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య

చలివేంద్రాలతో దాహార్తి నుంచి ఉపశమనం

ఆర్డీవో హెలా షారోన్

రేపల్లెరూరల్: ప్రయాణికులు, బాటసారుల వేసవి దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆర్డీవో హెలా షారోన్ అన్నారు. రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. రెవెన్యూ డివిజనల్ కార్యాలయానికి వివిధ రకాల పనులపై వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. వివిధ గ్రామాల నుంచి పట్టణానికి అనేక మంది వివిధ పనులపై వస్తుంటారని, ప్రతి ఇంటి ఆవరణలో తాగునీటిని అందుబాటులో ఉంచి వారి దాహార్తిని తీర్చాలని కోరారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీవో హెలా షారోన్

హామీలను నెరవేర్చిన నాయకుడు సీఎం జగన్

కర్లపాలెం: ఎన్నికల హామీలను నెరవేర్చిన జగనన్ననే మళ్లీ సీఎంగా గెలిపించుకుందామని వైఎస్సార్ సీపీ బాపట్ల ఎమ్మెల్యే అభ్యర్థి కోన రఘుపతి తనయుడు కోన నిఖిల్ తెలిపారు. కర్లపాలెం మండలంలోని చింతాయపాలెం గ్రామంలో సోమవారం సాయంత్రం కోన నిఖిల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఎన్నికల కరపత్రాలు అందజేసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. బాపట్ల జిల్లాను అభివృద్ధి చేసేందుకు ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి కోన రఘుపతిని ఎమ్మెల్యేగా, నందిగం సురేష్‌ను ఎంపీగా ఎన్నుకోవాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఎంపీటీసీ రాతంశెట్టి లక్ష్మణరావు, ఆట్ల నాగేశ్వరరెడ్డి, కాగిత మహేష్, సుభాస్ చంద్రబోస్, ఆట్ల నాగేశ్వరరెడ్డి, షంషీర్, గొర్రుముచ్చు మీరయ్య, గొర్ల సుబ్బారావు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

తెనాలిఅర్బన్: ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని నెహ్రూనికేతన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ సూచించారు. బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ జూనియర్ కళాశాలలో సోమవారం ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. ఎంపీసీ విభాగంలో కె.ఫరియా 972, డి.నీలిమా 969, జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో పి.యశస్విని 459, జి.ఎల్.ఎస్.అర్పిత 444 మార్కులు సాధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వి.శేషగిరిరావు, వైస్ ప్రిన్సిపల్ పి.నాగశంకర్, పలువురు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నెహ్రూనికేతన్‌లో రోబోటిక్ వైజ్ఞానిక ప్రదర్శన

తెనాలిఅర్బన్: గుంటూరుకు చెందిన రోబోవింగ్ టెక్నాలజీస్ సంస్థ సహకారంతో బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ హైస్కూల్‌లో సోమవారం రోబోటిక్ వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించారు. రోబో పని చేసే విధానం, కృత్రిమ మేథస్సుకు సంబంధించిన అంశాలు, డ్రోన్ పని తీరు, వీడియో గేమ్స్, విద్యుద్దీపాలను సెల్‌ఫోన్ ద్వారా వెలిగించడం వంటి నమూనాలను విద్యార్థులు తయారు చేసి ప్రదర్శనలో ఉంచారు. కార్యక్రమంలో రోబోవింగ్ టెక్నాలజీస్ డైరెక్టర్లు సాయిరాం, సాదిక్, నెహ్రూనికేతన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దాసరి గీతా కాంత్, పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం రాస్తారోకో

ప్రభుత్వం సాగర్ జలాలు విడుదల చేసినా అధికారుల నిర్లక్ష్యంతో చెరువులు నిండని వైనం

ప్రత్తిపాడు: తాగునీటి కోసం గ్రామస్తులు ఆందోళన బాట పట్టారు. దేవుడు కరుణించినా పూజారి వరమివ్వని చందంగా.. ప్రభుత్వం సాగర్ జలాలు విడుదల చేసినా, కేవలం అధికారుల పర్యవేక్షణా లోపంతో చెరువుల వరకు నీరు రావడం లేదంటూ రోడ్డుపై బైఠాయించి నాలుగు గంటల పాటు మండుటెండలో రాస్తారోకో చేశారు. వివరాల్లోకి వెళితే ప్రభుత్వం మంచినీటి చెరువులు నింపేందుకు సాగర్ జలాలను విడుదల చేసింది. టెయిలెండ్‌లో ఉన్న ప్రత్తిపాడు చెరువుకు వంకాయలపాడు మేజర్ ద్వారా నీరు రావలసి ఉంది. నీరు సజావుగా చివరి చెరువుల వరకు రావాలంటే అధికారులు కాలువ పొడవునా గస్తీ ఉంటూ, నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంటుంది. కానీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. దీంతో గ్రామస్తులే బృందాలుగా ఏర్పడి కాలువపై గస్తీ ఉంటూ నీటిని ప్రత్తిపాడు చెరువుకు తెచ్చుకునే ప్రయత్నాలు చేశారు. అయితే మార్గమధ్యంలో ఉన్న గ్రామాల వారు నీటిని దారి మళ్లించి వారి చెరువులకు నింపుకొనే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి కొందరు వ్యక్తులు లాకులు సైతం పగలగొట్టి విధ్వంసానికి పాల్పడ్డారు. దీంతో ప్రత్తిపాడు చెరువు వరకు వచ్చే నీరు అర్ధంతరంగా ఆగిపోయింది. ఇదే విషయమై స్థానికులు, నాయకులు ఎన్ఎస్పీ కెనాల్స్ జేఈఈ ఆంజనేయులు దృష్టికి పలు మార్లు తీసుకువెళ్లినప్పటికీ ఆయన నుంచి ఎటువంటి స్పందనా కనిపించలేదు. దీంతో ఏమి చేయాలో పాలుపోక ప్రత్తిపాడు గ్రామస్తులు సోమవారం ఉదయం ఆందోళన చేపట్టారు. అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ప్రత్తిపాడులోని గుంటూరు–పర్చూరు పాత మద్రాసు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ కె.దుర్గాప్రసాద్, ఎస్ఐ సోమేశ్వరరావులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన విరమించాలని ప్రజలను, నాయకులను కోరారు. అనంతరం ఎన్ఎస్పి కెనాల్స్ ఈఈ మురళీధర్ ప్రత్తిపాడుకు వచ్చి గ్రామస్తులతో మాట్లాడారు. వారు స్థానికంగా అధికారుల లోపాలను ఆయనకు వివరించారు. స్వయంగా తాను కూడా కాలువపైకి వెళ్లి కచ్చితంగా 48 గంటల్లో ప్రత్తిపాడు చెరువుకు నీళ్లు వచ్చేలా చర్యలు తీసుకుంటానని, ప్రత్తిపాడు చెరువులు సమృద్ధిగా నిండే వరకూ నీటిని అందిస్తామని స్పష్టమైన హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

దళిత ఉద్యమనేత కనపర్తి ఏసురత్నం


పుస్తకావిష్కరణలో ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి

తెనాలి : ప్రజలతో పనిచేస్తూ వారిని నడిపించే వారే ఆర్గానిక్ మేధావులని అంటారని, దళిత ఉద్యమ నేత కనపర్తి ఏసురత్నం ఆ కోవకు చెందుతారని ప్రముఖ రచయిత ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి అన్నారు. అయితానగర్ పొట్టి శ్రీరాములు పార్కులోని కమ్యూనిటీ హాలులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా కనపర్తి ఏసురత్నంపై చల్లపల్లి స్వరూపరాణి సంకలనంలో వెలువరించిన 'ఆర్గానిక్ ఇంటలెక్చువల్ కనపర్తి ఏసురత్నం' పుస్తక ఆవిష్కరణ, పరిచయ సభకు కనపర్తి బెన్‌హర్‌బాబు అధ్యక్షత వహించారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన స్వరూపరాణి మాట్లాడుతూ డెల్టా ప్రాంతంలో నాలుగు దశాబ్దాల పాటు దళిత సమాజం కోసం, కుల నిర్మూలన కోసం మార్క్సిజం, అంబేడ్కరిజం జమిలిగా ఉద్యమంలో కీలకపాత్ర వహించిన మహోన్నతుడు కనపర్తి ఏసురత్నం అన్నారు. ఆయన త్యాగాలు, ఉద్యమ జీవితం విస్మరించలేనివని, ఆయన అనుభవాలు భావితరానికి అవసరమన్నారు. ఆయన ఉద్యమ మిత్రులు తనతో కలిసి సమష్టిగా ఈ పుస్తకం తీసుకొచ్చినట్టు చెప్పారు. ఏసురత్నం ప్రతి వర్ధంతికి ఒక స్మారకోపన్యాసం ఏర్పాటుచేస్తామని ప్రకటించారు. పుస్తకం తొలి కాపీని అందుకున్న కమ్యూనిటీ అండ్ రూరల్ సొసైటీ డైరెక్టర్ డాక్టర్ స్వర్ణలతాదేవి మాట్లాడుతూ ఏసురత్నం నాస్తికుడైనా, మార్క్సిజం పట్ల, అంబేడ్కరిజంపైనా అచంచల విశ్వాసంతో దళిత ప్రజల అభివృద్ధికి కృషిచేశారని, అటువంటి వ్యక్తి జీవితాన్ని పుస్తకంగా తీసుకురావటం అభినందనీయమని చెప్పారు. ప్రధాన వక్త, న్యాయవాది పిల్లి విద్యాసాగర్ మాట్లాడుతూ దళిత మహాసభకు ముందే ఏసురత్నం అనేక ప్రతిఘటన పోరాటాలు నిర్వహించారని గుర్తు చేసుకున్నారు. వేము సమత, పిల్లి వాసు, సిద్దెల అబ్రహాం, మేకతోటి ప్రభాకరరావు, కనపర్తి డేవిడ్ ప్రసంగించారు. డాక్టర్ కనపర్తి అబ్రహాం లింకన్ వందన సమర్పణ చేశారు.



పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రొఫెసర్ స్వరూపరాణి, ఇతర పెద్దలు

'కల్పన ఆర్ట్స్' సదాశివరావు మృతి



తెనాలిరూరల్: పట్టణానికి చెందిన 'కల్పన ఆర్ట్స్' వ్యవస్థాపకుడు సింహాద్రి సదాశివరావు(82) సోమ వారం మృతి చెందారు. ఆయనకు కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. 1963లో 'కల్పన ఆర్ట్స్'ను స్థాపించి సినీ, వ్యాపార, రాజకీయ, నాటక కళారంగాలకు సన్మాన పత్రాలు, పోర్ట్రెట్ బొమ్మలు, ప్రముఖ కంపెనీల లోగోలు, ట్రేడ్‌మార్క్స్ లోగోలు, లైన్ ఆర్ట్‌కు పేరుగాంచారు. సైన్ బోర్డులు, బ్యానర్లు ఆకర్షణీయంగా రూపొందించేవారు. సదాశివరావు వద్ద 75 మంది శిష్యులు శిక్షణ పొంది వివిధ కంపెనీలు, ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. తెనాలి ఆర్ట్స్ అండ్ యాడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా చేశారు. ఆయన మృతికి కళాభారతి కమర్షియల్ ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంతాపం తెలిపింది.

మధుమేహ వ్యాధిని అదుపులో ఉంచుకోవచ్చు

డాక్టర్ కొమ్మారెడ్డి శంకర్‌రెడ్డి

లక్ష్మీపురం: క్రమబద్ధమైన ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ మధుమేహ వ్యాధిని అదుపులో ఉంచుకోవచ్చు అని జనరల్ ఫిజీషియన్ డాక్టర్ కొమ్మారెడ్డి శంకర్ రెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి అధ్యక్షతన ఆరోగ్యంపై అవగాహన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ షుగర్ వ్యాధి రావడానికి ప్రధాన కారణం అధిక బరువు, శారీరక శ్రమ తక్కువగా ఉండటం మానసిక ఒత్తిడి ఎక్కువగా ఉండటం నిద్రలేమి కారణాలన్నారు. ఆరోగ్యవంతమైన ఆహారం తీసుకుంటూ మంచి అలవాట్లతో జీవనశైలిని పాటిస్తూ డయాబెటిస్ ముప్పుని ఎదుర్కోవచ్చన్నారు. ఆకుకూరలు ఎక్కువగా తినటం, జంక్ ఫుడ్‌కి నో చెప్పటం, వ్యాయామం చేయటంతో పాటు అందుబాటులో ఉన్న నివారణ మార్గాల ద్వారా షుగర్ వ్యాధికి చెక్ పెట్టవచ్చన్నారు. డాక్టర్ శంకర్ రెడ్డిని సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి సంస్థ సభ్యులు టి.వి.సాయిరాం కోఆర్డినేటర్ గా వ్యవహరించగా, విద్యాధర కుమార్ పాల్గొన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో పశ్చిమాసియాలో యుద్ధ సంక్షోభంపై చర్చా గోష్ఠి నిర్వహించారు. విశ్లేషకులు, ప్రిన్సిపల్ రవిబాబు మాట్లాడారు. విద్యావేత్త టి.నారపరెడ్డి, సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి పాల్గొన్నారు.



ఆరోగ్య సూత్రాలను వివరిస్తున్న జనరల్ ఫిజీషియన్ డాక్టర్ కొమ్మారెడ్డి శంకర్‌రెడ్డి

నేడు కొల్లూరులో వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం

కొల్లూరు : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు మంగళవారం ఉదయం కొల్లూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ కొల్లూరు మండల కన్వీనర్ సూర్యదేవర రామకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు కొల్లూరు లాక్‌సెంటర్‌లోని వినాయకుడి ఆలయం వద్ద నుంచి ప్రారంభమవనున్న ఎన్నికల ప్రచారానికి వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు భారీగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ముగిసిన షటిల్ టోర్నమెంట్

తెనాలిరూరల్: రూరల్ మండల గ్రామం కొలకలూరులో ఈనెల 13న ప్రారంభమైన కొత్త ఐజక్ శ్యామ్ మెమోరియల్ షటిల్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. గ్రామానికి చెందిన కొత్త ఐజక్ శ్యామ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ (కిస్బా) ఆధ్వర్యంలో కొలకలూరు, నందివెలుగు, ఈమని, ఎరుకలపూడి, కొరిటె రం గ్రామాల స్థాయిలో వెటరన్ డబుల్స్, మెన్ డబు ల్స్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో 20 టీములు పాల్గొన్నాయి. మెన్ డబుల్స్ విన్నర్స్‌గా శ్రీకాంత్, అలోక్, రన్నర్స్‌గా వేణు, విజ్ఞాన్, వెటరన్ డబుల్స్ విన్నర్స్‌గా వినయ్‌కుమార్, కరిముల్లా, రన్నర్స్‌గా రాంబాబు, జెర్మియా నిలిచారు. కిస్బా ఉపాధ్యక్షులు పి.రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన బహుమతి ప్ర దానోత్సవంలో ముఖ్య అతిథిగా వాలీబాల్ జాతీయ స్థాయి క్రీడాకారుడు కరిసెట్టి సుబ్బారావు పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. ఆయన మా ట్లాడుతూ విద్యాదాత పొన్నెకంటి వెంజిమెన్ ఏర్పాటు చేసిన విద్యాసంస్థలో పాఠశాల ప్రధానోపాధ్యాయు నిగా, క్రీడాకారుడిగా క్రీడలను ప్రోత్సహించిన కొత్త ఐజక్ శ్యామ్ పేరిట సంస్థ ఏర్పాటు చేసి పోటీలు నిర్వహించటం అభినందనీయమన్నారు.